# ఉరిత్రాడు

రచన:
శ్రీ; వడ్లమాని కామేశ్వరరావు.

ఆదిసాయం సమయము. అనంతకోటి జీవరాసులకు వెలుగును ప్రసాదించిన సూర్యభగవానుడు అలసి విశ్రాంతి తీసుకొనటకై పశ్చిమ కొండల్లోకి జారుకుంటున్నాడు. సంధ్యగాలులు మంద మందగా వీస్తున్నాయి. సముద్ర కెరటాలు రాళ్ళకు ఢీకొనుటవల్ల కల్గె నీటిబిందువుల్లో అరుణకిరణాలు చొచ్చుకుని వాటిని మాణిక్యాల్లా ధగధగా మెరిపింపజేస్తున్నాయి. ప్రకృతిసౌందర్యాన్ని తిలకిస్తూ, సముద్రపుటొడ్డున యిసుకలో మేనుమరచి కూర్చున్నాడు ధర్మారావు. ప్రకృతి మాతకు దాసుడై తనెవరో కూడా తెలుసుకో లేని స్థితిలో నున్నాడతడు. ఆసమయంలో అతని హృదయంలో అనేక భావాలు రేకెత్తాయి. 'ఏమిటీ వింత ప్రపంచం? యీ సృష్టికి అంతు లేదు కాబోలు? మానవులు జన్మించటం, అనేక బాధలకు లోనై చివరకు అసువులు బాయటంతప్ప, తనకంటికి మరింకేమీ కన్పించడంలేదు. ఈవిధంగా మానవులను సృష్టించి వారిని కష్టాలకు గురికావించి, చివరకు దుడియింప చేయటమంటే సృష్టికర్తకు సంతోషం కాబోలు! లేకపోతే యేమిటిదంతా? భాగ్యవంతులు ధనమనేరథంపై కూర్చుని అంబర వీథుల్లో హాయిగా ప్రయాణం చేస్తున్నారు. దరిద్రులు ఆ రథచక్రాల క్రిందపడి మిలమిలా మిడతల్లా మాడి ప్రాణాలు కోల్పోతున్నారు. యిలా చేయటం సృష్టికర్తకు న్యాయంగా ఉందా? యీ మనుష్యుల్లో ధనికులూ, దరిద్రులూ అనురెండు వర్గాలెందుకు కల్గాయి? అవును! ప్రపంచమంతా న్యాయంతో నిండి ఉంటే మరి అన్యాయానికి తావేది? అలాగే ప్రజలంతా ధనవంతులైతే మరి దరిద్రులెవరు? ఒకవ్యక్తి బాగుపడాలంటే రెండవ వ్యక్తి సర్వనాశనం కాకతప్పదు. ఆనాడే మానవుల్లో న్యాయాన్యాయాలు, సత్యాసత్యాలు, పెద్దచిన్న తారతమ్యాలు. అవే లేకపోతే యీ సృష్టికి విలువేది? అని యీ విధంగా తనలో తాను తర్కవితర్క వాదాలు జరుపుకొనుచున్నధర్మారావుకు ''బాబూ న్యూసుపేపరు కావాలా'' అన్న పేపరు కుఱ్ఱకాడి కేక మెలకువను కల్గించింది. జేబులోంచి డబ్బులుతీసి ఒకపేపరుకొని పేజీలు త్రిప్పి చూస్తున్న అతనికండ్లు ఒకచోట హఠాత్తుగా ఆగిపోయాయి. 'దేశస్వాతంత్ర సముపార్జన కోసం తనసర్వస్వం ధారపోసిన శ్రీ విశ్వనాథం గారి ఆత్మహత్య? ధర్మారావు నెత్తిన పిడుగు పడ్డట్లయింది. కన్నులు బైర్లుకమ్మాయి ఎటు చూసినా తన కండ్లకు చీకటితప్ప మరింకేమీ కన్పించుటలేదు. శరీరం గబగబా వణికిపోతూంది. పాల పొంగులా పైకుబికి వస్తూన్న దుఃఖాన్ని ఆపుకుంటూ, లేనిసత్తువను తెచ్చిపెట్టుకొని యింటికిపోయి ప్రక్కపై వ్రాలాడు. తన ప్రియమిత్రుడు విశ్వనాథాన్ని తలుచుకున్నప్పుడల్లా అశ్రువులు కండ్లనుంచి ఏకధారగా ప్రవహిస్తున్నాయి. బ్రతికినంతకాలం హోదాగా జీవితాన్ని గడిపి చివరిదశలో

మా హృదయ పూర్వక అభినందనలతో....

**చారి & రాం**

రంగులు, రసాయనిక పదార్థాల దిగుమతిదారులు, వ్యాపారస్థులు.

పో. బా. నె: 38.—ఈస్ట్ గేట్—మధురై (ద. ఇ.)

ఉపకార్యాలయం:-293. తంబుచెట్టివీధి - మదరాసు - 1

భారతదేశమంతటా స్టాకిస్టులున్నారు,

కూడుకు గుడ్డకు వాచి ఆఖరుకు ఆత్మహత్య చేసుకొనుటే గత్యంతరమైందా తనమిత్రునకు? దేశస్వాతంత్ర్యముకోసం జీవితాన్ని, ధనాన్ని సర్వం ధారపోసిన తనస్నేహితునకు, దిక్కుమాలిన చావు మిత్ృత్వం వహించిందా? విశ్వనాథంతో కలిసి స్వాతంత్ర సమరంలో పాల్గొన్నవారంతా ప్రస్తుతం పెద్దపెద్ద పదవుల్లో వున్నారు. వారంతాకలిసి తనమిత్రునకు పైలోకంలో పదవిని చూపించారు అని యీ విధంగా మిత్రుని యెడబాటుకు వాపోవుచూ, హృదయభారంతో కృంగిపోతూన్న ధర్మారావుకు 'బాబూ ఉత్తరం' అని పోస్టుమాన్ పిలుపుకి బైటకి వెళ్ళి ఉత్తరాన్ని తీసుకొని చూచేసరికి అది విశ్వనాథం వ్రాసిన దేనని తెలుసుకున్నాడు. అసలే మిత్రుని కోసం కుమిలి కుమిలి యేడుస్తూన్న అతనికి యీ ఉత్తరం గోరుచుట్టుపై రోకలిపోటులా తగిలింది. గబా గబా ఉత్తరాన్ని చించి, చదవడం మొదలెట్టాడు.

మిత్రుడు ధర్మారావుకు విశ్వనాథం నమస్కరించి వ్రాయునది—

మిత్రమా!

ఈ ఉత్తరం నీకు చేరేవేళకు నేనీలోకాన్ని విడిచిపెట్టే యుంటాను. అలా చనిపోయే ముందు నాబాధను కొంతవరకు నీకు వ్యక్తపరచి మరీచనిపోదామనే ఉద్దేశ్యంతో వ్రాస్తున్నాను. మిత్రమా! నన్నీలోకం ఒక చీడ పురుగుగా భావించింది. సంఘున్నుంచి వెలివేసింది. మానవులు స్వార్థపరులు, ఎటువంటి సమయంలోనూ వారిని నమ్మకూడదనే సత్యాన్ని యిప్పుడుగాని నే తెలుసుకోలేక పోయాను. తల్లిదండ్రులు చెప్పిన మాట వినక దేశస్వాతంత్ర్య కోసం, సంఘాన్ని సంస్కరించాలనే ఉద్దేశ్యంతో ముందుకు ఉరికాను గాని, నాముందు ఒక అగాధం ఉందని కూడా తెలుసుకోలేక పోయాను. నాముందు చేతులు జోడించి నా సొమ్ము తిన్నవారంతా లక్షాధికార్లయ్యారు. కనీసం ఒక్కరైనా నామీద దయజూపలేదు, మిత్రమా! పైగా నన్ను చూసి నవ్వుకున్నారు 'అదుగో దేశస్వాతంత్ర సమరయోదుడు సంఘశ్రేయోభిలాషి' అని హేళనచేసారు. నేచెప్పినట్లు

నడచి నాయందు భక్తి శ్రద్ధలు కనబరచిన వారంతా పెద్దపెద్దపదవులు సంపాదించారు. వారైనా, నావైపు కన్నెత్తి చూడ లేదు. ఎలా చూస్తారు? పట్టుపాన్పులపై పవ్వళించి ప్రపంచాన్ని మరచి, హాయిగా నిద్రపోతున్న వారి కంటికే నెలా కన్పిస్తాను. చివరకు గొడ్డగా బ్రతికానసే ఆలోచనైనా చేయక కనపడిన వారందరి కాళ్ళుపట్టుకొని యాచించాను కానీ యేయొక్కరికీ నామీద దయలేక పోయింది. భార్య, బిడ్డలు ఆకలిబాధకు తాళలేక ప్రాణాలు కోల్పోయారు. కనీసం కన్న తల్లిదండ్రులైనా, నామీద కనికరించక చివరిదశలో కూడా నన్ను నిందిస్తూ చనిపోయారు. నావంటి దుర్మార్గుడు, కులద్రోహి యింక బ్రతికి యేం సాధించాలనే ఉద్దేశ్యంతో నేనీపని చేస్తున్నాను.

క్షమించు! ప్రాణసమానుడవైన స్నేహితుడవు నీవున్నావని నాకు తెలుసు. కాని యింతమందిచేత "ఛీ" అనిపించుకున్న నేను యీ పాడుముఖాన్ని నీకు చూపించలేక యీ ఉత్తరం వ్రాస్తున్నాను. లోకమంతా నేను దుర్మార్గుడనని యేక కంఠంతో పలికినా, నీవు మాత్రం నన్ను స్నేహితునిగా భావిస్తున్నావని, యికముందుకూడా ఆ విధంగానే భావిస్తున్నాను.

ఇంక సెలవు,
ఇట్లు
నీ ప్రియమిత్రుడు
విశ్వనాథం.

అని ఆ ఉత్తరాన్నంతా పూర్తిగా చదివిన ధర్మారావు ఒక్కసారి చిన్నపిల్లాడిలా బావురుమంటూ యేడవడం మొదలెట్టాడు. 'మిత్రమా! ఎంత దయావిహీనమైందీ లోకం. నీ వెవరికోసం నీ సర్వస్వాన్ని త్యాగం చేసావో, ఆ మనుష్యజాతే త్రాచుపాములా మారి కాటువేసిందా? నీవుపడ్డశ్రమకు యీ పాడులోకం నీకు బహూకరించినది ఒక 'ఉరి త్రాడా'! అని ఆవేశంతో యేవేవో మాట్లాడుతూ స్పృహతప్పి పడిపోయాడు ధర్మారావు.


మీ ఆభరణములకు
అతి శ్రేష్ఠమయినది
REGISTERED-TRADE-MARK
No:113228
సవరన్ మార్కు
పారీస్ వజ్రములు
వివరములకు

PARIS DIAMOND WORKS
207.D.BIG BAZAR
TIRUCHIRAPALLI — 8

పారిస్ డైమండ్ వర్క్సు
207.డి.బిగ్ బజారు
తిరుచురాపల్లి — 8